నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | ఫిబ్రవరి 14, 2025 | www.navatelangana.com

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

రాజంపేట్ మండలంలోని బసవన్నపల్లి, ఆర్గొండ, కొండాపూర్, గుండారం, సిద్ధాపూర్, ఎల్లారెడ్డిపల్లి, ఎల్లారెడ్డిపల్లి తండా గ్రామాలలో ఇటీవల కాలంలో మరణించిన కుటుంబాలను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని హామీనిచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బీరయ్య, సల్మాన్, శ్రీధర్, సంతోష్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

గర్భిణులకు వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. గురువారం రాజంపేట్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతినెల వైద్య పరీక్షలు నిర్వహించి.. పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంగీత, ఐశ్వర్య, సూపర్వైజర్ మంజూరు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, గర్భిణులు స్త్రీలు ఉన్నారు.

పరేషాన్ కార్డు

- ఏండ్ల కొద్దీ ఎదురుచూపులు
- వివిధ కారణాలతో ప్రభుత్వం కాలయాపన
- ఆఫ్‌లైన్ పూర్తయ్యాక.. మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- మీసేవల వద్ద బారులు తీరుతున్న జనం
- మొరాయిస్తున్న సర్వర్లు..
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

రేషన్‌కార్డుల కోసం అర్హులు ఏండ్ల కొద్దీ ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కారణాలతో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంలో జాప్యం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేషన్‌కార్డులను మంజూరు చేస్తుందనుకుంటే అర్హులకు నిరాశే మిగిలింది. ఏడాది పూర్తయినా.. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పుడు.. అప్పుడు అంటూ కాలయాపన చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రామ సభలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించింది. అలాగే ఆన్‌లైన్‌లోనూ ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తోంది. దీంతో మీసేవల వద్ద జనాల రద్దీ నెలకొంది. దీనికితోడూ సర్వర్ మొరాయించడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.


రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవకు వచ్చిన లబ్దిదారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేదలకు ఆహార భద్రత కోసం రేషన్‌కార్డుల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత ఉంది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేదరికంలో ఉన్న కుటుంబాలకు రేషన్‌కార్డుల్ని మంజూరు చేయాలి. రేషన్ కార్డు ద్వారా ఇతర పథకాలూ లబ్ధిపొందేందుకు అవకాశమున్నందున పేదలకు రేషన్‌కార్డు అనివార్యమైంది. నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే పాత రేషన్ కార్డులున్నాయి. అయితే కొత్తగా వేరుపడిన కుటుంబాలు, పెండ్లిళ్లు అయిన వాళ్లకు కార్డుల్లేవు. ఆదే విధంగా కుటుంబాల్లో కొత్తగా పుట్టిన వారి పేర్లు కార్డుల్లో చేర్చడడానికి అవకాశం ఇవ్వలేదు. దీంతో పెద్ద ఎత్తున రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేశారు.

ఇటీవల గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ..

కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో కొత్త రేషన్ కార్డుకోసం దరఖాస్తులు చేసుకున్న కొందరు అర్హులను గుర్తించింది. ఇటీవలే నిర్వహించిన గ్రామసభల్లో, బస్తీ సభల్లో పేర్లను ప్రకటించింది. అయితే అర్హులుగా ఉండి జాబితాలో పేర్లు రాని వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించడంతో పేర్లు రానివారు గ్రామసభల్లో, బస్తీ సభల్లో దరఖాస్తులు చేసుకున్నారు. అలాగే ప్రభుత్వం మీసేవలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇటీవలే ప్రకటించడంతో ప్రస్తుతం అర్హులుగా ఉన్నవారు.. గతంలో రేషన్ కార్డు ఉండి పేర్లు యాడ్ చేయాలనుకునేవారు మీసేవలకు పరుగులు తీస్తున్నారు.

మీసేవల వద్ద పడిగాపులు..

రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు తీసుకునే ప్రక్రియ బుధవారం నుంచి ఎమ్మార్వో కార్యాలయాలలో ప్రారంభమయ్యాయి. సర్వర్లు మొరాయించడంతో ప్రజలు ఎంఆర్ఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ దరఖాస్తులను అందజేస్తున్నారు. అలాగే తప్పనిసరిగా తిరిగి మీ సేవలకు క్యూ కట్టాల్సిన పరిస్థితి నగరంలో నెలకొంది. ప్రస్తుతం ప్రజలు తమకు ఎట్టి పరిస్థితులలో రేషన్ కార్డు కావాలనే ఎమ్మార్వో కార్యాలయాలకు వచ్చి మరి దరఖాస్తులు చేస్తున్నారు. మరికొందరు మీ సేవల వద్ద పడిగాపులు కాస్తున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో గల మీ సేవలో 10 గంటలకు రేషన్ కార్డు కోసం దరఖాస్తు ఫారాలను పట్టుకొని క్యూ పద్ధతిలో కూర్చున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అన్నీ మీ సేవ కేంద్రాలతో పాటు నిజామాబాద్ ఉత్తర మండలం ఎమ్మార్వో కార్యాలయం, దక్షిణ మండల ఎమ్మార్వో కార్యాలయాలలో ప్రజలు దరఖాస్తు ఫారాలను ఇచ్చేందుకు క్యూకట్టారు.

పెరుగుతున్న ఆశలు..

ఒకరకంగా కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రేషన్ కార్డు లేని వారు ఓటు వేయడం కూడా ఒక కారణం. కానీ వారికి రేషన్‌కార్డులు ఇవ్వడంలో మాత్రం ప్రభుత్వం చొరవ చూపడం లేదు. కొత్త రేషన్ కార్డులు ఎప్పుడా అని ఎదురు చూపు తప్ప చేతికందింది లేదు. గత ప్రభుత్వంలో కార్డుల కోసం దరఖాస్తు చేసిన వాళ్లతో పాటు కొత్త ప్రభుత్వంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమం తీసుకున్న దరఖాస్తులు సైతం పెండింగ్‌లోనే ఉన్నాయి. కొత్త సంవత్సరంలోనైనా కార్డులిస్తారని జనం ఎదురు చూసినా ఫలితం శూన్యంగానే ఉంది. ఇటీవల మంత్రివర్గంలో సూచన ప్రాయంగా కొత్త రేషన్ మంజూరు చేస్తామని లీకులిచ్చింది. జనవరి 26 నుంచి మంజూరు చేస్తామని చెప్పడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు పెరుగుతున్నాయి.


మున్సిపల్ కార్యాలయం వద్ద గుమిగూడిన ప్రజలు

ప్రజలు మధ్యవర్తులను నమ్మొద్దు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతుంది. అందుకు ప్రజలు మధ్యవర్తి సంబంధం లేకుండానే నేరుగా ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే సంబంధిత మీ సేవల వద్ద దరఖాస్తులను చేసుకోవచ్చు. ప్రభుత్వం సూచించిన సమయంలో కార్యాలయాల్లో ప్రతి ఒక్కరం అందుబాటులోనే ఉంటాం. కొత్త రేషన్ కార్డ్ మార్పులు చేర్పులకై దరఖాస్తులను కార్యాలయంలో స్వీకరిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులు చాలా వచ్చాయని వాటిని మున్సిపల్ పరిధిలో సర్వే జరగగా ఆ తర్వాత గ్రామసభ, వార్డు సభ నిర్వహించారు. అప్పుడు కూడా రేషన్ కార్డుల దరఖాస్తులను తీసుకున్నారు ఇది నిరంతరంగా కొనసాగుతుంది. సుమారు 80 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని వాటిని ఎప్పటికప్పుడు సాఫ్ట్ కాపీలు చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

- నిజామాబాద్ దక్షిణ మండల ఎమ్మార్వో జె.బాలరాజు

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

- రాజకీయ పార్టీలను కోరిన అదనపు కలెక్టర్ అంకిత్


సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను పరిశీలించి, ఏవైనా మార్పులు, చేర్పులు అవసరం ఉంటే సూచనలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ రాజకీయ పార్టీలను కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీ.సీ హాల్‌లో గురువారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. ఈ నెల 11వ తేదీన జిల్లాలోని 31 మండలాలు, వాటి పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ముసాయిదా జాబితాను ప్రకటించామని గుర్తుచేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను రూపొందించామని వివరించారు. 31 మండలాల పరిధిలో 307 ఎంపీటీసీ స్థానాలున్నాయని, 8,51,770 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు మొత్తం 1564 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటిలో 400 లోపు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 122 ఉండగా, 500 లోపు ఓటర్లతో కూడిన పోలింగ్ కేంద్రాలు 362 ఉన్నాయని, 750 వరకు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 1080 ఉన్నాయని వివరించారు. కొత్తగా ఏర్పాటైన మండలాలను కలుపుకొని మొత్తం 31 మండలాలకు గాను ఒక్కో మండలం వారీగా ఎన్ని ఎంపీటీసీ స్థానాలు, ఎంతమంది ఓటర్లు ఉన్నారు, అందుకనుగుణంగా ఎన్ని పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందనే వివరాలను అదనపు కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలున్నట్లయితే తెలియజేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించేందుకు గాను అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లోనూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓలు గురువారం సమావేశాలు నిర్వహించారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు వచ్చిన పక్షంలో వాటిని పరిష్కరించి, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రకటించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సాయాగౌడ్, డిప్యూటీ సీ.ఈ.ఓ సాయన్న, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోడకూలి ఒకరు మృతి

- మరొకరికి గాయాలు



నవతెలంగాణ-తాడ్వాయి

గోడకూలి ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని దేమికలాన్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బెస్త నారాయణ తన ఇంటి మరమ్మతు పనులను గ్రామానికి చెందిన బొల్లి రాములుతో కలిసి చేస్తున్నాడు. అందులో భాగంగా గోడను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గోడకూలి ఇరువురిపై పడటంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని 108లో కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. కాగా నారాయణ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. బొల్లి రాములుకు తల, నడుము భాగాలకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నాడు. మృతునికి భార్య బెస్త లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- జిల్లా అధ్యక్షులుగా ఎస్.అజయ్, జిల్లా కార్యదర్శిగా ముదాం అరుణ్ కుమార్


ఎస్.అజయ్, ముదాం అరుణ్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కామారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా ఐదవ మహాసభల సందర్భంగా కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా ఎస్.అజయ్, కార్యదర్శిగా ముదాం అరుణ్ కుమార్‌ను, జిల్లా ఉపాధ్యక్షులుగా కే రాహుల్, సహాయ కార్యదర్శిగా ఎస్.నితీన్, జిల్లా కమిటీ సభ్యులుగా మణికంఠ, నవీన్, సాయి ప్రకాష్‌గౌడ్, విలాస్, ప్రశాంత్, శ్రీకాంత్, అశోక్ నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని, నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పనిచేస్తామని అన్నారు. ఈ జిల్లాలో ఎస్ఎఫ్ఐ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

మహిళాలకు ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని డిఆర్‌డిఓ అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో అన్ని మండలాల నుంచి వచ్చిన మండల సమాఖ్య అధ్యక్షురాళ్ళకు, ఆరోగ్య కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘం సభ్యులు ఆరోగ్యం, పోషణ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అందుకే సంఘం సమావేశం ప్రత్యేక ఎజెండగా ఆరోగ్యంపై అవగాహనకై చర్చించామని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లు, మనిషి ఆరోగ్యానికి దోహదపడుతాయని, 10 ఆరోగ్య అంశాలపై మహిళలకు శిక్షణ ఇచ్చినట్టు వివరించారు. ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్‌లుగా డిపిఎంలు సాయిలు, శ్రీనివాస్, ఏపియంలు, సరోజని, గంగాధర్, రాజేందర్ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

- రేషన్ కార్డు రాలేదని మనస్థాపంతో..



నవతెలంగాణ-నిజాంసాగర్

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన గడ్డమీది సందీప్ గౌడ్ (29) అనే యువకుడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..

వివరాలు మెయిన్‌లో..

తక్కువ వేతనం.. ఎక్కువ పని

- సమస్యలను పరిష్కరించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-వర్ని

గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం తక్కువ వేతనాలు ఇచ్చి ఎక్కువ పనులు చేయిస్తోందని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ విమర్శించారు. గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలైన గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు, బూట్లు, సబ్బులు, నూనెలు, యూనిఫామ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామపంచాయతీ కార్మికులందరికీ కనీస వేతనం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సెలవు ఇవ్వాలని కోరారు. లేకపోతే యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు నన్నేసాబ్, యూనియన్ మండల అధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి లింగం, కోశాధికారి రాజు, ఉపాధ్యక్షులు సాయిచరణ్, వివిధ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజశ్రీ


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-కంఠేశ్వర్

కీటక జనీత వ్యాధులు ప్రబలకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజశ్రీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో పనిచేస్తున్న వివిధ పిహెచ్‌సీల ల్యాబ్ టెక్నీషియన్లు, నోడల్ సూపర్వైజర్లు, సబ్ యూనిట్ అధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజశ్రీ మాట్లాడుతూ.. జిల్లాలో కీటక జనిత వ్యాధులు ముఖ్యంగా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు మలేరియా, యాక్టివ్, పాసివ్ రక్తపూతల పరీక్షలను పెంచాలని, నోడల్ అధికారులు, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు యాంటీ లార్వెల్ స్ప్రే, ఫ్రైడే డ్రైడే, లార్వా నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. ఆశా కార్యకర్తలు ఏఎన్ఎం రోజువారీ గృహ సందర్శనలో జర సర్వేతో పాటుగా కీటక జనిత వ్యాధులపై అవగాహన కలిగించాలని, బోధకాల వ్యాధికి రాత్రి నిర్వహించే లార్వా సర్వేను చేపట్టాలని తెలిపారు. సెంటినల్ సర్వేలో భాగంగా ప్రతి టీం 300 స్లైడ్స్ చొప్పున మొత్తం 6000 స్లైడ్స్ సేకరించాలని తెలిపారు. జిల్లా ఉపవైద్యాధికారులు వారి వారి ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ డివిజన్ల వారీగా వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పిహెచ్‌సి నోడల్ అధికారులు, సబ్ యూనిట్ అధికారులకు సమీక్ష సమావేశాలు నిర్వహించి కీటక జనీత వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఏ ఇంటి వద్ద కూడా దోమల లార్వాలు కనిపించకుండా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కీటక జనీత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, అసిస్టెంట్ మలేరియా అధికారి అబ్దుల్ సలీం, వివిధ మండలాల నుంచి వైద్య సిబ్బంది


హాజరైన అధికారులు

జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ బాలుకు సన్మానం

- రక్తదానంలో చేస్తున్న సేవలను అభినందించిన డాక్టర్ ఎస్‌కె రషీద్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి కర్షక్ బి.ఎడ్ కళాశాలలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ బాలు ఇటీవలే దేశంలో ప్రతిష్టాత్మకమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, శ్రీ సాయి సేవా భగవాన్ ఉత్తమ జాతీయ సేవా పురస్కారాన్ని అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని అభినందన సన్మాన కార్యక్రమాన్ని కర్షక్ బీఈడి కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కర్షక్ బీఈడీ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్‌కే రషీద్ మాట్లాడుతూ.. 17 సంవత్సరాల నుంచి డాక్టర్ బాలు రక్తదానంలో చేస్తున్న సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, వ్యక్తిగతంగా 75 సార్లు, తలసేమియా చిన్నారుల కోసం 4500ల యూనిట్ల రక్తాన్ని, ఇప్పటివరకు 25 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించడం కామారెడ్డి జిల్లాకే గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కిషన్, బీమా గౌడ్, మమత, తయిబా, సూపరింటెండెంట్ నర్సింలు, బాబురావు, చాత్రో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలి

- తెలంగాణ గురుకుల బాలికల రాష్ట్ర కార్యదర్శి రమణ కుమార్


మాట్లాడుతున్న గురుకుల బాలికల రాష్ట్ర కార్యదర్శి రమణకుమార్

నవతెలంగాణ-నిజామాబాద్

విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని తెలంగాణ గురుకుల బాలికల రాష్ట్ర కార్యదర్శి రమణ కుమార్ అన్నారు. గురువారం ఎడపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలంటే భయపడకుండా చదవాలని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని చదువులో రాణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెసిడెన్షియల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచిందని, మౌలిక వసతుల కల్పనకు ఎన్నడూ లేనంతగా కృషి చేస్తుందని అన్నారు. ఇందుకు ప్రతిఫలంగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలవాలని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో మంచి భోజనాన్ని అందించేందుకు ప్రిన్సిపాల్స్ పర్యవేక్షణ చేయాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి అభినందించారు. కిచెన్ గార్డెన్‌లో విద్యార్థులు బ్యాచ్‌లవారీగా కూరగాయలు పండించడం అభినందనీయమన్నారు. నిజామాబాద్ డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమయపాలన తప్పకుండా పాటించి పరీక్షల్లో విజయం సాధించాలని అన్నారు. ప్రతిరోజు సబ్జెక్టుల వారిగా గమనం చేసుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో అన్ని వసతులున్నందున ఉపాధ్యాయులు పరీక్షలు అంటే విద్యార్థుల భయం పోగొట్టి అనుకూలమైన వాతావరణం తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాశంకర్, వైద్యులు వెంకటరెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ

- 12 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు
- ఒక్కరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు వేసిన 13 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇందులో 12 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కాగా ఒక్కరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలకు విత్ డ్రా చేసుకున్న వారిలో గవ్వల లక్ష్మి, ఎడ్ల సాయి కృష్ణప్రియ, కావూరి సత్యనారాయణ గౌడ్, ఆలగొండ కృష్ణ హరి, నాలకంటి యాదగిరి, బడే నరసయ్య, లింగాల శ్రీనివాస్, రేకల సైదులు, మదనం గంగాధర్, లింగం కృష్ణ, సోమగాని నరేందర్, దార మనోహర్‌లు కాగా టీచర్స్ ఎమ్మెల్సీకి గవ్వల శ్రీకాంత్ నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


విద్యార్థులకు ప్యాడ్లు అందజేత


మండలంలోని చింతలూరు జెడ్‌పిహెచ్ఎస్ పదవ తరగతి విద్యార్థులకు కొలీ ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ పరీక్ష ప్యాడ్స్‌ను గురువారం అందజేశారు. నాగుల శ్రీనివాస్ తన పెద్ద కుమారుడి జన్మదినాన్ని పురస్కరించుకుని జడ్పీహెచ్ఎస్ చింతలూర్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం, సిబ్బంది, విద్యార్థులు ప్రనీత్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

పిఎల్ఐ, ఆర్‌పిఎల్ఐ మేళా సందర్శన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరాయత్ నగర్ సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ అంకాపూర్ ను జిల్లా ఎస్ఎస్‌పి జనార్ధన్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి ప్రచార వివరాలు తెలుసుకున్నారు. అంకాపూర్‌లో సదాశివ్ నగర్ లబ్ధిదారునికి పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్ ను ఎస్ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. తర్వాత మునిపల్లి, దేగాం, మంథని, పిప్రి, గోవింద్ పేట్ గ్రామాల్లో బీపీఎంలు, ఏబీపీఎంలు ఇంటింటికి తిరుగుతూ పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ స్కీమ్‌ల ప్రత్యేకతలను ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ గ్రామంలో ఉన్న బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులలో పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ స్కీమ్‌లు చేయాలని కరపత్రాలను పంచుతూ ప్రజలకు వివరాలను తెలియజేస్తూ చైతన్యపరిచారు. కార్యక్రమంలో బీపీఎంలు లింబాగౌడ్,రమేష్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,శ్రీనివాస్,రవీంధర్, జగదీశ్వర్, వెంకటేష్ సజన, లక్ష్మి, భావన, రవళి, శ్వేత, వెంకట్రాం, వాసు, సంజీవ్, అనిల్, ఏబీపీఎంలు బారాడ్ రాజేష్, పడాల భూషణ్, బింగి సుదర్శన్, పవన్, శ్రీనివాస్, తోట తేజస్విని, కవిత, రుతిక, బాషీద్, రాము, జి.ఎస్.హరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ బంధం



● ప్రేమంటే నమ్మకం.. బాధ్యత ● అర్థం చేసుకుంటే సమ్యలుండవు ● నేడు ప్రేమికుల దినోత్సవం

ప్రేమంటే ఫిబ్రవరి 14న జరుపుకొనే ప్రేమికుల రోజు మాత్రమేకాదు.. ఒకరికొకరు గిఫ్టులు ఇచ్చుకోవడం.. సరదాగా గడపడం మాత్రమే కాదు.. ప్రేమించుకున్నవారు పెళ్లి చేసుకుని జీవితాంతం అదేప్రేమతో ఉంటే ప్రతిరోజు వారికి ప్రేమికుల దినోత్సవమే. ప్రేమంటే నమ్మకం... బాధ్యత.. ప్రేమపెళ్లిళ్లు చేసుకుని ఒకరికొకరు అర్థం చేసుకుంటూ ఆదర్శంగా ఉండాలి. ప్రేమకు కులం లేదు.. మతం లేదు. ప్రేమపెళ్లి చేసుకోవాలనేకునేవారు ముందు బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలి. అప్పుడే ప్రేమ పెళ్లి చేసుకోవాలి. సరైన అవగాహన లేకుండా ప్రేమించి పెళ్లి చేసుకుని అనంతరం అపార్థలతో విడిపోవడం ఇద్దరికీ నష్టమే.

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రేమ ఎప్పుడు...
ఎక్కడ... ఎలా... ఎవరితో...
ప్రారంభమవుతుందో తెలియదు.

ప్రేమంటే ఒకరినొకరు అర్థం చేసుకుని, వచ్చే సమస్యలను పరిష్కరించుకుంటూ ఒకరిలో ఉన్న లోపాలను సరిచేసుకుని ముందుకు సాగుతారో వారి ప్రేమ కలకాలం కొనసాగుతూనే ఉంటుంది. ప్రేమ శాశ్వతంగా నిలబడాలి అనుకునే వారు కొన్ని సమయాల్లో, కొన్ని విషయాలలో ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటూ అవసరమైతే వాటిని త్యాగం చేయడం ప్రేమను ప్రేమపెళ్లిళ్లను గెలిపిస్తుంది. ఒక్కొక్కరి ప్రేమ ఒక్కో సందర్భంలో పరిచయమవుతుంది, ఆ పరిచయమే ముందు స్నేహంగాను తర్వాత ప్రేమగా మారి పెళ్లి బంధంగా కలకాలం ముందుకు సాగుతుంది.

దండలు మార్చుకొని జంటగా ఏర్పడ్డం



రెండు దండలు మార్చుకుని జంటగా ఏర్పడ్డం. కుటుంబ పెద్దలు, సమాజంలోని పెద్దలు, అధికారులు, అనధికారులు అందరి సమక్షంలో ఆదర్శంగా వివాహం చేసుకున్నాం. దండలు మార్చుకునే సమయంలో పంతులు లేడు, తాళి బొట్లు లేవు. బాజా భజంత్రీలు లేవు, ఎటువంటి హంగు ఆర్భాటలు లేకుండా సమాజం ఆమోదం పొందుటకు 1996 ఏప్రిల్ 23 న ఆదర్శంగా వివాహం చేసుకున్నాం. ఆదర్శంగా జీవిస్తున్నాం.ఎటువంటి సమస్యలను కూడా తెచ్చుకోకుండానే ముందు కొనసాగుతున్నాం.

- పాకాల నర్సింలు-ఉమా

ఉద్యోగం వైపు ఒకరు... ఉద్యమం వైపు మరొకరు



ఒకరు ఉద్యోగం వైపు... మరొక ఉద్యమం వైపు.. ఎంచుకొని జీవితాన్ని ముందుకు కొనసాగిస్తున్నాం. ప్రేమించుకునే సమయంలోనే ఒకరు ఉద్యోగం మరొకరు ఉద్యమం వైపు వెళ్లాలని అనుకున్నాం. ముందుగానే ప్రణాళిక చేసుకున్నాం. ప్రేమ వివాహం తో ఇద్దరిలో అన్యోన్యత ఏర్పడింది. సాధారణ వివాహాలు చేసుకునేవారి కంటే బాగున్నాం. కులాంతర వివాహాలకు ప్రభుత్వాలు సహకరించాలి. ప్రభుత్వాలు ప్రోత్సహించాలని, ప్రోత్సాహకతను పెంచాలి. దాంతో కుల అంతరాల్లో ఉన్న తేడా తొలిగిపోతుంది. పిడిఎస్యు విద్యార్థి సంఘంలో పరిచయం ప్రేమగా మారింది. నాలుగేళ్ల ప్రేమ తర్వాత, ఇరు కుటుంబాల అంగీకారంతో బంధుమిత్రులు, ఉద్యమ సహచరుల సమక్షంలో 2013లో కులాంతర, కట్నకానుకల ఊసు లేకుండా పెళ్లి చేసుకున్నారు. ప్రేమంటే ఇష్టమే కాదు నమ్మకం, బాధ్యతతో కూడిన ప్రేమ విజయవంతం అవుతుంది. ఒకరిపై ఒకరికి పరస్పరం ప్రేమ, నమ్మకం, గౌరవంతో ఉంటే ఎన్ని కష్టాలైనా సంతోషంగా ఎదుర్కోవచ్చు.

- ఎం.సుధాకర్ టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి
ప్రగతి, (లెక్చరర్ ఇన్ జువాలజి)

నమ్మకం, బాధ్యతతో ముందుకు సాగుతున్నాం



ప్రేమ వివాహంలో నమ్మకంతో బాధ్యతతో ఉండి జీవితాన్ని ముందుకు సాగుతూ ఎటువంటి సమస్యలు వచ్చిన అధిగమిస్తున్నాం. 2019 జులైలో వీఆర్వోగా బాధ్యతలు స్వీకరించా. అదేసంవత్సరం మనిషా పంచాయతీ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టింది. అనంతరం విధులు నిర్వహణలో భాగంగానే సెప్టెంబర్‌లో భవానిపేటలో పరిచయం ఏర్పడి ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. 2021 జనవరిలో ప్రేమ వివాహం చేసుకున్నాం. ప్రస్తుతం పెంటాకుర్ద్ క్యాంప్‌లో పంచాయతీ సెక్రటరీగా మనిషా పనిచేస్తుంది. ఎన్సిసిలో జూనియర్ అసిస్టెంట్‌గా సృజన్ పని చేస్తున్నారు.

సృజన్-మనీషా



కుల నిర్మూలనకు ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చాలా ముఖ్యం



కుల నిర్మూలన జరగాలంటే ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ అనేది చాలా ముఖ్యం. ప్రేమ వివాహం పూర్తి కావాలంటే శ్రద్ధ పెట్టి విద్యను అభ్యసించాలి. జీవితం ముందుకు సాగాలంటే జీవిత భద్రత అనేది చాలా ముఖ్యం. అటువంటి సమయంలోనే ప్రేమ వివాహం చేసుకోవాలి అటువంటి ప్రేమ వివాహం ముందుకు సాగడానికి చాలా ఉపయోగపడుతుంది. ప్రేమ వివాహం పూర్తి కావాలంటే శ్రద్ధ పెట్టి విద్యను అభ్యసించాలి, విద్యను అభ్యసించడమే కాకుండా జీవితం ముందుకు సాగాలంటే జీవిత భద్రత అనేది చాలా ముఖ్యం, అటువంటి సమయంలోనే ప్రేమ వివాహం చేసుకోవాలి అటువంటి ప్రేమ వివాహం ముందుకు సాగడానికి జీవితంలో ముందుకు సాగడానికి చాలా ఉపయోగపడుతుందని అన్నారు. అందుకు ముఖ్యంగా ధైర్యం గా అడుగు వేస్తేనే ప్రేమ వివాహం పూర్తి అవుతుంది. ముందు చదువుపై దృష్టి పెట్టాలి. చదువు జీవితానికి ఉపయోగపడుతుంది. జీవితానికి ఓ భద్రతతో ముందుకు వెళ్లి ప్రేమపెళ్లి చేసుకోవాలి. అందుకే అంబేద్కర్ ఆశయాలతో చదువును నమ్ముకుని మా ఇద్దరు పిల్లలకు చదివించాం. 1988లో ఫిబ్రవరి 05న ప్రేమ వివాహం జానకంపేట్ లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేసుకున్నాం. నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడ ప్రాంతంలో ఇంటి పక్కన ఉండే సందర్భంలో నేను గిరిరాజ్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న సమయంలో మాకు పరిచయం ఏర్పడింది. నిజాంసాగర్ మండలంలోని ఇరిగేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా 1987 ఉద్యోగంలోచేరా. అనంతరం ప్రేమ వివాహం చేసుకునేందుకు తాము ఎస్సి, అమ్మాయి వారు వైశ్య అని వారి కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. దీంతో మెట్పల్లి వద్ద ఓ గ్రామంలో 10 రోజులు తలదాచుకున్నాం. ఆ తర్వాత అమ్మాయి వాళ్ళ అక్క, బావ నెల రోజుల తర్వాత మాట్లాడారు, ఆమె కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు ఒక సంవత్సరం తర్వాత మాట్లాడి చేరదీశారు. మా అమ్మాయి ఎంబిబిఎస్ పూర్తి చేసి ప్రేమ వివాహం చేసుకుంది, అబ్బాయి ప్రస్తుతం ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్లో ఆడిటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తొందరపాటు ఆలోచనతో ప్రేమలో మోహంతో పెళ్లి చేసుకోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడతాయి. జీవితంలో భద్రతకు ఒక మార్గం ఉండాలి. అటువంటి ప్రేమ వివాహం అయితే విజయవంతమవుతుంది.


- నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్
గైని గంగారాం, విద్యావతి

ఆయనే అర్థం చేసుకుంటారు...



నాకు ఇటువంటి భర్త దొరకడం చాలా అదష్టం. చాలా సందర్భాల్లో ఎక్కువగా ఆయనే అర్థం చేసుకుంటారు. మేము బీకాం డిగ్రీ చదివే సమయంలోనే 2011లోనే పరిచయం. చదువు పూర్తి చేసిన తర్వాత 2014 మార్చ్ 12న ప్రేమ వివాహం చేసుకున్నాం. ప్రేమ వివాహానికి కుటుంబ పెద్దలు సహకరించనప్పటికీ రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నాం. కష్టాన్ని నమ్ముకుని కుటుంబ బాధ్యతలను మోస్తూ ముందుకు సాగుతున్నాం. పెళ్లి చేసుకున్న ఒకటి రెండు నెలల తర్వాత కుటుంబ సభ్యులు రావడం వెల్లడం జరిగేది. ఆయనకు నలుగురు చెల్లెల్లు ఉన్నప్పటికీ వాళ్లందరూ మాతో కలిసిపోతూనే ఉంటారు. ప్రేమ పెళ్లి చేసుకునే సమయంలోనే మంచి నిర్ణయంతో ముందుకు సాగితే ఎటువంటి సమస్యలు వచ్చినా అధిగమించగలం. ఇద్దరిలో మంచి అవగాహన చాలా అవసరం. చిన్న సమస్యలు వచ్చినా పెద్ద సమస్యలు వచ్చినా వాటిని అధిగమిస్తు ముందుకు వెళ్లడం చాలా అవసరం.

- ఆందోల్ భాగ్యశ్రీ, డి.కార్తీక్



అందరం ఆనందంగా ఉన్నాం...

ప్రేమ వివాహం చేసుకోడం ఒక మధురానుభూతి. జీవితాంతం సుఖసంతోషాలతో ఉండాలంటే, సరైన వయస్సు వచ్చిన తర్వాత, తల్లి దండ్రులను ఒప్పించి చేసుకుంటే అందరం సంతోషంగా ఉంటారు. భార్య భర్తల సంతోషంలో, తల్లి దండ్రులు కలిస్తే ఆ ఆనందం వేరే ఉంటుంది. ప్రస్తుతం మేం ఆ ఆనందాన్ని , అందరం అనుభవిస్తున్నాం.

- ముత్యాల శ్యాంబాబు (అడ్వకేట్) ఫాతిమా తబస్సుమ్ (బ్యాంక్ ఉద్యోగి)



పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ విడుదల చేయకపోతే

సచివాలయాన్ని ముట్టడిస్తాం

● బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్

మెడికల్ సీట్ల కేటాయింపులో బీ, సీ కేటగిరీల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ అన్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న 4650 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఒకవైపు ఎగ్జామ్స్ దగ్గరలో ఉండగా మరోవైపు ఈ ఫీజు భారం విద్యార్థులపై పడి అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలల్లో పూర్తి ఫీజులు చెల్లిస్తామని బీసీ విద్యార్థులకు షరతులు లేని విద్యను అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడిచిపోయినా విద్యార్థులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం చాలా బాధాకరమని, ఇదే సమయంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లాంటి వారికి వేల కోట్ల బిల్లు ఒకేసారి శాంక్షన్ చేయడం దేనికి సంకేతం అని వారు ప్రశ్నించారు. ఇంజనీరింగ్ విద్య లో కూడా 10000 ర్యాంక్ నిబంధన బీసీ విద్యార్థులకు ఎత్తివేస్తామని మాటిచ్చి దాన్ని కూడా నిలుపుకోలేకపోయిందని అన్నారు. డిగ్రీ ఇంటర్మీడియట్ ఒకవైపు ప్రవేట్ కాలేజీ యజమాన్యాలు విద్యాసంస్థలు నడపలేక తెచ్చిన అప్పులకు వడ్డీలు కూడా కట్టుకోలేని పరిస్థితులలో కాలేజీలు మూతపడే పరిస్థితుల్లో వారు ఉన్నారని తెలిపారు. మెడికల్ ప్రవేశాల్లో బి కేటగిరి సి క్యాటగిరి లో రిజర్వేషన్లు అమలు చేయాలని మొదట ఓపెన్ క్యాటగిరి పిలిచిన తర్వాతనే రోస్టర్ ప్రకారం రిజర్వేషన్లు విద్యార్థులను ప్రవేశాల ద్వారా తీసుకోవాలని కోరారు పది రోజుల్లో పూర్తి పెండింగ్ ఫీజులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌చేయడంతోపాటు రాష్ట్ర సచివాలయాన్ని కూడా ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రం గౌడ్ తో పాటు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స అంజనేయులు, కొయ్యాడ శంకర్, సంతోష్ కుమార్, బసవరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సిఎండిని కలిసిన బంజారా విద్యార్థి నాయకులు..


సింగరేణి సిఎండిని కలిసిన నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సింగరేణి సిఎండి బలరాం నాయక్‌ను తెలంగాణ యూనివర్సిటీ కి చెందిన బంజారా విద్యార్థి నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 21న తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించే శ్రీ సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక ను అయనకు అందజేశారు. ఈ వేడుకల్లో పాల్గొంటానని విద్యార్థి నాయకులకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఉద్యోగ నాయకులు బికోజీ, దిగంబర్ చౌహాన్,గులాబ్, గిరిజన శక్తి అధ్యక్షులు శ్రీను రాథోడ్, నాయకులు శ్రీకాంత్, లక్ష్మణ్, రాము, పథ్వి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అబాకస్ పోటీలకు శ్రీ భాషిత పాఠశాల విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి లో జరిగిన అబాకస్ పోటీలలో స్టార్ జూనియర్ లెవెల్ వన్ లో బెస్ట్ పెర్ఫార్మర్‌గా బి .శైలేంద్ర రెండవ తరగతి , జూనియర్ లెవెల్ వన్ లో స్టార్ పెర్ఫార్మర్గాబి. భూమేష్ చంద్ర నాలుగవ తరగతి బహుమతులు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబాకస్ ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపక శక్తిని పెంపొందింపజేసి గణితం సబ్జెక్టు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవడానికి అబాకస్ ఉపయోగపడుతుందని చెప్పారు. అంతేకాకుండా రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించి జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం

తెలంగాణ రాష్ట్ర సీపీఐ(ఎం) మాజీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం కుమారుడి పెండ్లి వేడుకలను బుధవారం రాత్రి రాష్ట్ర రాజధాని జెఆర్‌సీ కన్వెన్షన్‌లో నిర్వహించగా.. జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, ఇరుపార్టీల నాయకులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే,

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
శుక్రవారం | ఫిబ్రవరి 14, 2025 | www.navatelangana.com

పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడిన ట్రాక్టర్

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ అవసరాల నిమిత్తం ట్రాక్టర్‌ను బోధన్‌కు తీసుకెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్ళింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో పెను ప్రమాదం తప్పింది. క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌ను స్థానికులు బయటకు తీశారు. నూతనంగా ఏర్పాటైన బైపాస్ రోడ్డుపై ఎటువంటి ప్రమాద సూచికలు లేకపోవడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు.



బోల్తాపడిన ట్రాక్టర్

అభ్యంతరాలుంటే తెలపండి

- పలు మండలాల ఎంపీడీవోల సూచన
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నవతెలంగాణ-విలేకరుల బృందం

అభ్యంతరాలుంటే తెలుపాలని పలు మండలాల ఎంపీడీవోలు సూచించారు. గురువారం ఆయా మండల కేంద్రాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు.

రెంజల్ :తెలంగాణ రాష్ట్రంలో త్వరలో ఎంపీటీసీ, జడ్పీటీసి ఎన్నికలను పురస్కరించుకొని స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలకు, ఒక జడ్పీటీసి స్థానానికి గానూ 54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో 29,845 మంది ఓటర్లను గుర్తించామని, ఎలాంటి అభ్యంతరాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, రాము, వడ్డెన్న, ఇంతియాజ్, సీనియర్ అసిస్టెంట్ అన్వర్ హైమద్, జూనియర్ అసిస్టెంట్ సతీష్ కుమార్ తదితరులున్నారు.



నాగిరెడ్డిపేట్: మాట్లాడుతున్న ఎంపీడీవో

ఓటర్ జాబితాపై అఖిలపక్ష నాయకులతో సమావేశం..

నాగిరెడ్డిపేట్ :మ ండల కేంద్రంలో గల మండల ప రి ష త్ కార్యాలయంలో ఓటర్ డ్రాఫ్ట్‌పై గురువారం అఖిలపక్షం నాయకులతో ఎంపీడీవో ప్రభాకర్ చారి సమావేశాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఓటర్ డ్రాఫ్ట్, పోలింగ్ కేంద్రాల జాబితాను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభాకర్ చారి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 25,775 ఓటర్లు ఉన్నట్లు మండల వ్యాప్తంగా 50 పోలింగ్ స్టేషన్‌లను గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి 155 మంది ఓటు వేయడానికి 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ ఠాగూర్, మైనార్టీ అధ్యక్షుడు ఇమామ్, ప్రధాన కార్యదర్శి డివిటి కిష్టయ్య, బీఆర్ఎస్ నాయకుడు వంశీగౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లింగంపేట్ :త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పార్టీల అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశానుసారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నరేష్ ఆయా పార్టీల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 72 పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామపంచాయతీలో పరిధిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీఓ మలహరి, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆయా పార్టీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక పట్టివేత

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని కోడిచెర్ల గ్రామ శివారులో అక్రమంగా రవాణా చేసి డంప్ చేసిన 38 ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్ గంగాధర్ గురువారం సీజ్ చేసినట్టు తెలిపారు. ఆ ఇసుకను ప్రభుత్వ పనుల కోసం డి.డి. కడితే వారికి కేటాయిస్తామని పేర్కొన్నారు. అలాగే ఎవరైనా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు.



పట్టుకున్న ఇసుక డంప్

గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన మండల నాయకులు



గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

నవతెలంగాణ-రెంజల్

నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని నాయకులు ఆయన స్వగృహానికి వెళ్లి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లచ్చేవార్ నితీన్, తిరుపతి బుజ్జి, కార్తిక యాదవ్, రాకేష్, కంఠం గంగారం, సాయిలు, సంతోష్, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పదంగా వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నిజాంసాగర్

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బూరుగులు గ్రామ శివారులో గల అటవీ ప్రాంతంలో జరిగింది. నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మల్లెల తిమ్మయ్య (48) బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి బుర్గుల్ గ్రామ శివారులో శవమై కనిపించడంతో అతని కుమారుడు అయిన యేసు ప్రభు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చదువుకునే రోజుల్లోనే సమాజ సేవ

- సౌజన్య రమేష్ సన్మాన కార్యక్రమంలో పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సౌజన్య రమేష్ చదువుకునే రోజుల్లోనే సమాజ సేవలో ముందుండేవారని స్వాన్ ఇండియా జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి.బి సత్యం పేర్కొన్నారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మద్నూర్ ఏఎంసీ చైర్మన్ సౌజన్య రమేష్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వాన్ ఇండియా జిల్లా అధ్యక్షులు డాక్టర్ పిబీ సత్యం, స్వాన్ ఇండియా రాష్ట్ర నాయకులు డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. సౌజన్య రమేష్ చదువుకునే రోజులోనే సమాజ సేవ చేశారని తెలిపారు. నేడు ప్రజల సేవ చేసే భాగ్యం లభించినందుకు వారిని అభినందిస్తూ మున్ముందు ఎన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికీ జైలు శిక్ష

నవతెలంగాణ-నిజామాబాద్

ఎడపల్లి మండల కేంద్రంలో ఈ నెల 4, 5 తేదీలలో మద్యం సేవించి వాహనాలను నడిపించిన ఇద్దరు వ్యక్తులను గురువారం ఉదయం బోధన్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి శేష తల్పసాయి ఎదుటహాజరు పర్చగా సెకండ్ మెజిస్ట్రేట్ ఇరువురి ఇద్దరికీ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

17న బాల త్రిపుర సుందరి దేవి వార్షికోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో శ్రీశ్రీ బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి ఆలయం నిత్య వేడుకలను 17న అంగర ంగ వైభవంగా నిర్వహించనున్నట్టు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ బిళ్ళ రామ్మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారించిన సెక్రెటరీ

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని తిమ్మానగర్ గ్రామ మహంకాళి గుడి కాలనీవాసుల నీటి ఎద్దడి నివారించుటకు గాను పంచాయతీ సెక్రెటరీ సాయిబాబా తన సొంత నిధులు రూ.22 వేలు నూతన బోర్ మోటర్ కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని మహంకాళి గుడి కాలనీవాసులకు పాత బోరు మోటర్ ఎనిమిది నెలలుగా పలుసార్లు మరమ్మతులు చేసిన పనిచేయడంమ లేదని, దాంతో కాలనీవాసులకు తీవ్ర తాగునీటి ఇబ్బందులు తలెత్తడంతో శాశ్వత పరిష్కారానికి సెక్రెటరీ తన సొంత డబ్బులతో నూతన బోరు మోటర్ వేయించారు. అనంతరం గ్రామ, కాలనీవాసులు సెక్రటరీ సాయిబాబాకు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లాల వినయ్, గ్రామపంచాయతీ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని దళిత కాలనీలో చెడిపోయిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి బాలు గురువారం తెలిపారు. కాలనీకి వచ్చే పైప్‌లైన్ చెడిపోవడంతో తాగునీటి ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశంతో తక్షణ మరమ్మతులు చేయిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు.



అంబేద్కర్ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బట్టెంకి బాల్‌రాజు

నవతెలంగాణ-కామారెడ్డి

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కో ఆర్డినేటర్ వరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు కాడారం వినయ్ కుమార్ సమక్షంలో కామారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బట్టెంకి బాల్‌రాజును నియమించినట్టు వరుణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా బాలరాజుకు జాతీయ కో ఆర్డినేటర్ వరుణ్ కుమార్ భారత రాజ్యాంగం బుక్‌ను బహుకరించారు. అనంతరం బట్టెంకి బాలరాజు మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘంను విస్తృతం చేసి బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భావజాలంను ప్రజల వద్దకు చేర్చడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకంకు సహకరించిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు బొంద రాజ్‌కుమార్‌కు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగం శ్రీశైలంకు, రాష్ట్ర కార్యదర్శి చెవ్వ లింగంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సరోజినీనాయుడు సామాజిక చైతన్యశీలి

- ఆంగ్లభాష నైపుణ్యాలను నేర్చుకోవాలి
- ఆకాశవాణి అందరివాణి

నవతెలంగాణ-మద్నూర్

భారత కోకిల సరోజినీ నాయుడు సమాజానికి చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆంగ్లభాష నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ నందాల గంగాకిషోర్, ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత బి.వెంకట్ పేర్కొన్నారు. తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో సరోజినీ నాయుడు జయంతి, జాతీయ ఆంగ్లభాష దినోత్సవాన్ని, ప్రపంచ ఆకాశవాణి దినోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి అక్షరాంజలిని ఘటించారు. సరోజినీ నాయుడు సామాజిక చైతన్య శీలి అని తెలిపారు. కవయిత్రిగా గొప్ప కీర్తి గడించారని, విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని అన్నారు. ఆంగ్లభాష నైతికమూల్యాలపై ప్రదర్శనను ఏర్పాటుచేసి అవగాహనను కల్పించారు. నాటికలు, ఏకపాత్రాభిన యం, సంభాషణలు, దేశభక్తి గేయాలు, నృత్యాలు, వివిధ వేషధా రణలు ప్రదర్శించి సభను అలరించాయి. ఆంగ్లభాషలో వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. సహాయ ప్రిన్సిపాల్ సుమన్, ఆంగ్లభాష పండితులు శంకర్, రాజు, ఉపసంక్షేమాధికారి నరహరి, ఉపాధ్యాయులు జాదవ్ గణేశ్, సంతోష్, గోవింద్, శైలజ, శివకళ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్

బాలుడు అదృశ్యం



నవతెలంగాణ-కామారెడ్డి

సిరిసిల్ల జిల్లాలోని గంబీరావుపేట మండలంలోని గోరంటాల గ్రామానికి చెందిన బత్తిని శివరామ కృష్ణ(14) అనే బాలుడు గురువారం కామారెడ్డి పట్టణంలోని అశోక్ నగర్ కాలనీ రైల్వే గేట్ వద్ద నుంచి తప్పిపోయినట్టు కామారెడ్డి పట్టణ సీఐ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోరింటాకు గ్రామానికి చెందిన శివరామకృష్ణ పట్టణంలోని ప్రోబెల్స్ స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్నాడు. అతనిని తన తల్లి గురువారం మధ్యాహ్నం ఒంటిగంటకు స్కూల్లో విడిచిపెట్టేందుకు వెళ్లింది. ఈ క్రమంలో అశోక్ నగర్ కాలనీలో గల రైల్వే గేట్ వద్దకు రాగానే బాలుడికి స్కూల్‌కు వెళ్లడం ఇష్టంలేకపోవడంతో తన తల్లి చేతిని విడిపించుకుని పారిపోయాడు. దీంతో బాలుడి తల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 8712686145, 7989017027 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఆంగ్ల భాషా దినోత్సవ వేడుకలు



ఆంగ్ల భాషా దినోత్సవ వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో గురువారం ఆంగ్లభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆంగ్ల భాష ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆంగ్లభాష పట్టు సాధించి ఎన్నో విజయాలు సొంతం చేసుకోగలమని ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ తెలిపారు. సరోజినీ నాయుడు దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణలో ఆంగ్ల భాష దినోత్సవం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన పాఠ్యాంశాల కృత్యాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆంగ్ల భాష ఉపాధ్యాయులు తబితా, ప్రవీణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ప్రజా సమస్యల పరిష్కార పనులలో నిమగ్న మయ్యారు. గురువారం మండలంలోని బస్వాపూర్, తిప్పాపూర్, అంతంపల్లి, పెద్దమల్లారెడ్డి, కంచర్ల, కాచాపూర్ ఆయా గ్రామాలలో నీటి సమస్యలను, కంపోస్టు షెడ్డు పనులు పరిశీలించారు. నీటి సమస్య ఉంటే పంచాయతీ కార్యాలయంలో తెలియజేయాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను పరిశీలిస్తున్న కార్యదర్శి

కాంప్లెక్స్ పాఠశాలలో టిఎల్‌ఎం మేళా

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని నెలవారీ కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా శెట్‌పల్లి బాలికల ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సముదాయంలో పిఎల్‌ఎం మేళాను గురువారం నిర్వహి ంచారు. సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా ఇంగ్లీష్ డేను కూడా నిర్వహి స్తూ ప్రపంచంలో నేడు ఆంగ్లానికి ఉండే ప్రాధాన్యత ను ఛార్ట్స్ ద్వారా తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా మండల ఎంఈఓ షౌకత్ అలీ, శెట్‌పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వసుధ, సంగారెడ్డి ఉన్నత పాఠశాల శేషయ్య ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కాంప్లెక్స్ సముదాయంలో ఉన్న 13 పాఠశాలల ఉపాధ్యాయులు ఇంగ్లీష్, తెలుగు, గణితం పరిసరాలు విజ్ఞానంకు సంబంధించిన వివిధ రకాలైన 200 బోధన భ్యాసనోపకరణాలను తయారుచేసి ప్రదర్శించారు. విద్యార్థులు కృత్యాధార బోధన ద్వారా విద్యను అభ్యసించే విధంగా ఇట్టి బోధనోపకరణాలు ఉపయోగపడతాయని ఎంఈఓ సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శోభారాణి, దామోదర్, సాయన్న, పర్వయ్య, సముదాయ కాంప్లెక్స్ సిఆర్పి రాజు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మేళాలో పాల్గొన్న పలువురు

జాతీయ సదస్సును జయప్రదం చేయండి

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ పిలుపు

నవతెలంగాణ-కామారెడ్డి

ఫాసిస్ట్, కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిర్వహించే జాతీయ సదస్సుకు విద్యావంతులు, యువకులు హాజరై విజయవంతం చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28న ఢిల్లీలో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఫాసిస్ట్ మతోన్మాద బిజెపి తమదాడుల్ని ఎక్కుపెట్టిందని, మతం పేరట విడదీసి రెచ్చగొట్టే రాజకీయాలను అవలంబిస్తుందన్నారు. సెక్యులర్ భావాలపై, ప్రజాస్వామిక శక్తులపై తమ దాడులను ఎక్కుపెట్టిందని, దేశప్రజలు సంఘటితంగా ఫాసిస్ట్, మతవాద రాజకీయ పార్టీ అయిన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి జి.సురేష్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ కామారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు ఏ.ప్రకాష్, పివైఎల్ రాష్ట్ర నాయకులు అనిల్, స్థానిక నాయకులు నర్సిరెడ్డి, పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 18న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభకు జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క గ్రామీణ వైద్యులు హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకిషన్, ప్రధాన కార్యదర్శి శ్రీను, వైద్యులు సుదర్శన్, గంగాధర్, తేజస్కర్, అంజనేయులు, పాల్గొన్నారు.

పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మండల విద్యాధికారి శ్రీహరి

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని వివిధ పాఠశాలల్లో ప్రజ్ఞోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని గండివేట్, పేట్‌సంగెం, పొతంగల్ కలాన్, చద్మాల్ తండా, గాంధారి పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్సే రైటింగ్, రీడింగ్ రైటింగ్, కాంపిటీషన్స్ పరీక్షలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి శ్రీహరి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కుమారస్వామి, రంగారావు, వెంకటేశ్వర్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐకెపి టైలరింగ్ ఉచిత శిక్షణ శిబిరాన్ని సందర్శన



మాట్లాడుతున్న డీపీఎం ఐబి సుధాకర్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఐకెపి ఆధ్వర్యంలో మహిళ సంఘాలకు నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని డీపీఎం ఐబి సుధాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడారు. కార్యక్రమంలో జుక్కల్ ఏపీఎం సత్యనారాయణ, కోఆర్డినేటర్ రామకృష్ణ, శిక్షణ ట్రైనర్ జమున, సీసీలు కృష్ణ, సంజీవ్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 14, 2025 | www.navatelangana.com

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లలో పారిశుధ్య పనులపై మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించారు. ఈ మేరకు గురువారం తెల్లవారుజామున కంఠేశ్వర్, గోల్ హనుమాన్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ఇలటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, పరిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

ఇసుక వాహనాల పట్టివేత

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని సుంకెట్ గ్రామం నుండి బుధవారం రాత్రి అనుమతి లేకుండా రెండు ఇసుక వాహనాలు ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసే పట్టుకున్నామని ఎస్సై విక్రమ్ తెలిపారు. రెండు వాహనాలు పట్టుకొని పరిశీలించగా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించి రెవెన్యూ అధికారులకు అప్పజెప్పన్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హెడ్ కానిస్టేబుల్ వాసుదేవ్

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ వాసుదేవ్ మాట్లాడుతూ గ్రామంలో యువకులు గంజాయికి అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఎవరైనా గంజాయి అమ్మిన గంజాయి తాగిన మాకు సమాచారం అందించాలని యువకులకు సుచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోను చేసి మీ సమాచారం సేకరిస్తారని వాటి ద్వారా మీ అకౌంట్ నుండి డబ్బులు మాయం చేస్తారని తెలిపారు. వారి ఫోన్లు సంబంధిత పోలీస్ శాఖకు సమాచారం అందించాలని అన్నారు. యువకులు స్మార్ట్ ఫోన్ వాడటం వల్ల అందులో కొత్తగా యాప్స్ వేసుకుని సైబర్ నేరాలకు బలి అవుతున్నారని హెచ్చరించారు. ఎక్కడైనా ప్రమాదం జరిగిన వెంటనే 100 ఫోన్‌కాల్ ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 13 నుండి 16 వరకు డిస్టిక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియం శంభాజీ నగర్, మహారాష్ట్రలో జరుగుతున్న 68వ జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ అండర్-14 పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున జిల్లా క్రీడాకారులు బాలుర విభాగంలో పెనకంటి వర్షిత్ రాష్ట్ర జట్టు కెప్టెన్ (సత్యశోధక్ పాఠశాల సిరికొండ) మర్కంటి నిహాల్ చంద్ర (నారాయణ హై స్కూల్ ఆర్మూర్), పుప్పాల నివాస్ (సాంఘిక సంక్షేమ పాఠశాల బోధన్), తిట్ల రోహన్ (సాంఘిక సంక్షేమ పాఠశాల ఆర్మూర్) పాల్గొంటున్నారు.

బాలికల విభాగంలో..

కుస్తాపురం అహల్య రాష్ట్ర జట్టు కెప్టెన్ (సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆర్మూర్), చిక్కాల శ్రీ వర్షిని (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ), కాకర్ల నిహారిక (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముచ్కూర్), పసుల సమన్విత (సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ధర్మారం బి) పాల్గొంటున్నారు. రాష్ట్ర జట్లకు కోచ్ జడ్పీహెచ్ఎస్ తొర్లికొండ ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ వ్యవహరిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల మెదక్ జిల్లా తూప్రాన్ లో జరిగిన రాష్ట్ర పోటీలలో బాల బాలికలు మొదటి స్థానం సాధించి ఎక్కువమంది జిల్లా క్రీడాకారులు జాతీయ పోటీలలో పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర జట్టును జాతీయ పోటీలలో ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు.

డ్రగ్స్ చాక్లెట్ పట్ల జాగ్రత్త

- విద్యార్థులకు ఎంఈఓ హెచ్చరిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మార్కెట్లో దుకాణాల్లో గంజాయి డ్రగ్స్ కల్పిన చాక్లెట్లు విక్రయిస్తున్నారని, దీని పట్ల పాఠశాల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ దక్షిణ మండల విద్యాశాఖ అధికారి సాయి రెడ్డి హెచ్చరించారు ఈ నెల 13న గురువారం ఎంఈఓ జీపీఎస్ కోట గల్లి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ప్రార్థన పూర్తి అయిన తర్వాత అసెంబ్లీలో ఎంఈఓ మాట్లాడారు పాఠశాల చుట్టుపక్కల ఉన్న కిరాణా షాపుల్లో చాక్లెట్లు కొని తినవద్దని, ఆ షాపులపై ఉపాధ్యాయులు ఒక కన్నేసి ఉంచాలని సూచించారు విద్యార్థులను కూడా గమనించాలని అన్నారు. ఒకవేళ అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు విద్యార్థులు గాని ఉపాధ్యాయులు గాని ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అనంతరం పాఠశాల రిజిస్టర్లను తనిఖీ చేశారు మూడవ తరగతి క్లాస్ కు వెళ్లి విద్యార్థుల విద్యా స్థాయినీ సబ్జెక్ట్ టీచర్ ను అడిగి తెలుసుకున్నారు ఎఫ్ ఎల్ ఎన్ కు సంబంధించి ప్రతి ఒక్క విద్యార్థికి వ్యక్తిగతంగా చదివించారు. యుడైస్ అపార్ ఐడి ఆధార్ 100% నమోదు ప్రశస్త గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు ప్రతి క్లాస్ కి వెళ్లి విద్యార్థుల స్థాయిని తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు మూడవ తరగతి విద్యార్థులు కొంతమంది చదువులో వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు చదువులో వెనకబడ్డ విద్యార్థులను గుర్తించి వారి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెడ్మాస్టర్ ను ఆదేశించారు ఎం ఈ ఓ వెంట ప్రధానోపాధ్యాయులు రామచందర్ గైక్వాడ్ ఉపాధ్యాయులు సవిత మమత ముకుంద్ సంతోష్ నందిని ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

ధ్రువ నారాయణకు మరణం విప్లవోద్యమానికి తీరని లోటు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్.. కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ ధ్రువ నారాయణకు సంయుక్త మండల కమిటీ. నాయకులు గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ ధ్రువ నారాయణ అకాల మరణం ప్లవోద్యమానికి తీరని లోటన్నారు. కామ్రేడ్. ధ్రువ నారాయణ బీహార్ రాష్ట్ర కి చెందిన కామ్రేడ్ నక్సల్ బరి ఉద్యమ ప్రభావంతో విప్లవోద్యమంలోకి అడుగు పెట్టారు. గుండెపోటుతో ఈనెల 12న మరణించారని అన్నారు. డిజన్ కార్యదర్శి . దేవారం లు మాట్లాడుతూ కామ్రేడ్ ఐదు దశాబ్దాలకు పైగా విప్లవ ఉద్యమంలో అనేక రంగాల్లో ఉద్యమాలు నిర్మించారని గుర్తు చేసుకున్నారు. ధ్రువ నారాయణ ఆలోచన ఆశయాన్నిముందుకు తీసుకు వెళ్లడమే తనకు నిజమైన నివాలి అని అన్నారు. కార్యక్రమంలో మాస్ లైన్ జిల్లా నాయకులు కామ్రేడ్ ఎం.ముత్తన్న, సంయుక్తమండల కార్యదర్శి కిషన్, పిడిఎస్‌యు నాయకులు. నిఖిల్ రాజన్న. శేఖర్, జిల్లా ఉపాధ్యక్షురాలు సత్యమ్మ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు, మగ పిల్లలు సమానమే

- జిల్లా సంక్షేమ అధికారిని ఎస్కే రసూల్ బి
- చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయొద్దు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/మోపాల్

చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం ద్వారా భ్రూణ హత్యలకు పాల్పడడం ద్వారా ఘోర అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, ఆడపిల్లలు మగ పిల్లలు సమాజంలో సమానమే మాట మరువ వద్దని జిల్లా సంక్షేమ అధికారిని ఎస్కే రసూల్‌బి పేర్కొన్నారు. గురువారం మహిళ, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పఢావో పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిచ్ పల్లి ప్రాజెక్ట్ పరిధిలోని రాంపూర్ డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థినులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మోపాల్ మండలంలోని బోర్గం (పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మహిళా సాధికారత, జిల్లా బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిడిపిఓ సౌందర్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, రాంపూర్-లో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారిని ఎస్కే రసూల్-బి హాజరై మాట్లాడారు.

ఎంపవరింగ్ ద గర్ల్స్ ఫర్ బ్రైట్ ఫ్యూచర్ అంటూ బేటి బచావో బేటి పడావో అనే కార్యక్రమం యొక్క ఉద్దేశాలను తెలిపారు. ఆడపిల్లల లింగ నిష్పత్తిని తగ్గుదలను అరకట్టాలని చెప్పారు. దేశంలో 23శాతం ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకముందే పెళ్లిళ్లు అవుతున్నాయని, దీన్ని 9శాతం తగ్గించాలని బేటి బచావో బేటి పడావో ముఖ్య ఉద్దేశమన్నారు. ఎస్ హెచ్ ఎఫ్ ఎస్ 5 సర్వే ప్రకారం 2021 - 2022 సంవత్సరం గాను 25 సంవత్సరాల తర్వాత ఉన్న ఆడపిల్లలు 30 శాతం మంది కి పెళ్లిళ్లు అవుతున్నాయని, 18 సంవత్సరాలలోపు ఉన్న ఆడపిల్లలు 13 శాతం పెళ్లిళ్లు చేసుకుంటున్నారని, అలాగే 15 సంవత్సరాలలోపు ఉన్న ఆడపిల్లలు 12 శాతం మంది పెళ్లిళ్లు చేసుకుంటున్నారని వివరించారు. అంతకుముందు విద్యార్థినులచే సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో ఐసీడీఎస్ సిడిపిఓ జ్యోతి, సూపర్వైసర్లు, మమత, బుజ్జి, భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ గోవర్ధన్, పాఠశాల యాజమాన్యం, పోషణ అభియాన్ కో -ఆర్డినేటర్ రంజీత్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. బోర్గంలో సూపర్వైజర్లు జాకీరా స్వరూప సమీన గారు ప్రధానోపాధ్యాయురాలు శంకర్ , మెడికల్ ఆఫీసర్ సంతోష్, అంగన్వాడీ టీచర్స్ రాజ్య లక్ష్మి, సువర్ణ, ప్రేమలత, లావణ్యతదితరులు పాల్గొన్నారు.


డిచ్‌పల్లి: ర్యాలీని ప్రారంభించిన రసూల్‌బి

హామీల అమలుకు చలో హైదరాబాద్

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ/మోపాల్

6 గ్యారంటీల హామీలను వెంటనే అమలు చేయాలని ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నిజామాబాద్ నగర కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఆరు గ్యారంటీలతోపాటు, ఏడవ హామీ ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20 న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ గోడ పోస్టర్లను నీలం రామచంద్రయ్య భవనంలో విడుదలచేయశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ నిజామాబాద్ నగర కమిటీ కార్యదర్శి నీలం సాయిబాబా మాట్లాడుతూ...... కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీలల్లో ఆరు గ్యారంటీలతో పాటు మొత్తం 420 హామీలను ఇచ్చింది అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్న ఇందులో ఒకటి అర వాగ్దానాలు తప్ప అత్యధికం అలాగే ఉన్నాయన్నారు. రైతులకు చేస్తానన్న రుణమాఫీ ఇంకా సగానికి సగం అమలు కాలేదని, రైతుబంధు ఎకరాకు 15000ఇస్తానని 12000 మాత్రమే ప్రకటించారని అన్నారు. రైతు భరోసా ఇప్పటికే ఒక పంట ఎగ్గొట్టారని, ఇందిరమ్మ ఇళ్ల పథకం సంవత్సరం దాటిన ఆచరణ రూపంలో రాలేదని, పోడుభూములకు పట్టాలు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. చేయూత పథకం ప్రారంభం కాలేదని, ధరణి దోషలపై చర్యలు లేవని, నిరుద్యోగులకు ఉద్యోగ భృతి లేదని అన్నారు. చలోహైదరాబాద్‌లో అన్ని వర్గాల ప్రజలు ప్రజాసామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర నాయకులు శివకుమార్ కుమార్, జి.రమేష్, నర్సింగ్రావు, శంకర్, రాజు, పిడిఎస్‌యూ నాయకులు జన్నారపు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కూడా అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 20న నిర్వహించే చలోహైదరాబాద్‌ను రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎఐకెఎమ్ఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేయడంలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒకటే సజావుగా కొనసాగుతుందని, మిగతా కొన్ని పథకాలు ప్రారంభమే కాలేదని అన్నారు. రైతాంగ ప్రజా సమస్యల పరిష్కారంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమవుతుందని తెలిపారు. ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతాంగ ప్రజా సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ తో ఈనెల 20న హైదరాబాదులో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని వారు కోరారు. అన్ని రకాల ధాన్యానికి అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని వారు కోరారు. గత పాలకుల తప్పుడు విధానాల ఫలితంగా జిల్లాలో గల రెండు చెక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయని, అధికారంలోకి రాగానే చెక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని అన్నారు. దీనికోసం వేసిన సబ్ కమిటీ ఈ ప్రాంతంలోని చక్కర ఫ్యాక్టరీని పరిశీలించి ప్రభుత్వానికి తగిన నివేదిక ఇచ్చిన కూడా చక్కెర ఫ్యాక్టరీని తెరిపించకపోవడంలో ఏంటని భూమయ్య ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్ సి ఎస్ ఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించి దాన్ని బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నడిపించాలని భూమయ్య డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం లో మహిళలకు నెలకు 2500 రూపాయలు గాని, కల్యాణ లక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలని, నిరుద్యోగులకు జీవనభృతి గాని, వృద్ధులకు 4000 పెన్షన్ ఇవ్వాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కూడా అమలు కావడం లేదని వారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కూడా అమలు జరిపి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారంకోసం ఈ నెల 20న జరిగే భారీ బహిరంగ సభకు రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గు ఎరన్నచిన్నయ్య, కట్లే రజినీకాంత్, బి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మోపాల్: మాట్లాడుతున్న ఎఐకెఎమ్ఎస్ నాయకులు

చిలుకూరు ఆలయ పూజారిని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

చిలుకూరు ఆలయ పూజారి రంగరాజన్‌పై ఇటీవల దాడి ఘటన జరగడంతో గురువారం ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కలిసి మాట్లాడి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఇటువంటి దాడులను ఉపేక్షించేది లేదని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హిందూ దేవతలు, పూజరులపై ఇలా చేయడం బాధాకరం అని అన్నారు. ఇలాంటి ఘటనలకు వ్యతిరేకమని ఎమ్మెల్యే అన్నారు.

ఘనంగా సరోజినీ నాయుడు జయంతి వేడుకలు

నవతెలంగాణ-బాల్కొండ

సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని చిట్టాపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సరోజినీ నాయుడు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు సరోజినీ నాయుడు గూర్చి ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ సరోజినీ నాయుడు జీవిత విశేషాలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారెడ్డి,సుదర్శన్, నర్సారెడ్డి, భృగు మహర్షి, శ్రీనివాస్, రాజేందర్ గౌడ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నానో కణాలు ఉపయోగించి తయారు చేయవచ్చు

- కొరియా ప్రొఫెసర్ గంగరాజు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్లాస్టిక్స్‌కు బదులుగా కాలుష్యం లేని ప్లాస్టిక్స్‌ను నానో కణాలు ఉపయోగించి తయారు చేయవచ్చని ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజు అన్నారు. గురువారం తెలంగాణ వర్సిటీ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్స్మెంట్ ఇన్ నానో టెక్నాలజీ అండ్ బయో మెడికల్ రీసర్చ్ అనే అంశంపై డాక్టర్ బి సాయిలు విభాగాధిపతి అధ్యక్షతన దక్షిణ కొరియాకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజు పాల్గొని ఉపన్యాసించారు. నిత్యం ఉపయోగించే ప్లాస్టిక్స్‌కు బదులుగా కాలుష్యం లేని ప్లాస్టిక్స్‌ను నానో కణాలు ఉపయోగించి తయారు చేయవచ్చన్నారు. వివిధ వ్యాధులకు సంబంధించి స్కానింగ్స్‌లో కూడా నానో కణాలు కూడా అత్యంత అద్భుతంగా పనిచేస్తాయని, ఒక ఔషధం శరీరంలో ఒక వ్యాధికి సంబంధించిన టార్గెట్ ను చేరడానికి అత్యంత ప్రభావంతంగా పనిచేస్తుందని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగరాజును తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ మహేందర్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ డేనియల్, డాక్టర్ సురేష్, నాగేంద్రబాబు రీసెర్చ్ స్కాలర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాలు తనిఖీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో మూడో స్పెల్ ప్రయోగ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొత్తం 32 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరుగుతుండగా గురువారం జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. నిర్మల హృదయ జూనియర్ కళాశాల, క్రిసెంట్ జూనియర్ కళాశాల, ఎస్ఎస్సార్ జూనియర్ కళాశాల, స్టాండర్డ్ జూనియర్ కళాశాల, గోల్డెన్ జూబ్లీ జూనియర్ కళాశాల, ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాలలను ఇంటర్ విద్య అధికారి తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్ అస్లామ్, కనకమహాలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలో మరో 12 కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కెమెరాలు పనిచేస్తున్న విషయాన్ని స్వయంగా ఇంటర్ విద్య అధికారి, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు పరిశీలించి సమీక్షించారు.

అమెరికాలో భారత పౌరులపై ట్రంపు దుశ్చర్యలను ఖండించండి : పీడీఎస్‌యు

నవతెలంగాణ-ఆర్మూర్

అమెరికాలో భారత పౌరులపై ట్రాంప్ దుశ్చర్యాల ను ఖండించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని, రేవంత్ రెడ్డి సర్కార్ విద్యవ్యతిరేక విధానాలను గురువారం క్లాస్ టు క్లాస్ ప్రచారం చేసినట్టు పిడిఎస్యు రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్ అన్నారు. ఏరియా కమిటీ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో ఏరియా అధ్యక్షులు నిఖిల్‌తో కలిసి మాట్లాడారు. వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, విద్య శాఖ మంత్రినీ నియమించాలని, 5.8 తరగతి లో డిటెంక్షన్ విధానాన్ని రద్దు చేయాలని, రాబోయే బడ్జెట్ సమావేశంలో విద్య రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, వాటి అభివృద్ధి కూడా నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే పిడిఎస్యు తమ ఉద్యమాలను ఉధృతం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా, కార్యదర్శి మమత, ఉపాధ్యక్షులు వినోద్, సహాయకర్యదర్శి సిద్ధు, నాయకులు సాయిరాజ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

- పశ్య పద్మ



మాట్లాడుతున్న పశ్య పద్మ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర బడ్జెట్ ను సవరించాలని తెలంగాణ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ కాలనీలో గల హమాలీ యూనియన్ ఏఐటియుసి కార్యాలయంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు హాజరైన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025-2026 కేవలం సంపన్న వర్గానికి ప్రయోజనకరంగా ఉందని, రైతులకు, కార్మికులకు, నిరుపేద ప్రజలకు వ్యతిరేకంగా ఉందని అన్నారు. రైతులు సుదీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్స్ పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేసి అమలుకు నిధులు కేటాయించకపోవడం, రుణమాఫీ చట్టం చేసి ఎలాంటి ప్రస్తావన ఈ బడ్జెట్ లో చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. ఆదాయ పన్ను 12 లక్షల వరకు మినహాయింపు ఇవ్వడం కేవలం 80 నుంచి 85 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని, కానీ రెండు కోట్ల 50 లక్షల మంది ధనికులకు, కార్పొరేట్ కంపెనీల యజమానులకు ఉపయోగపడే విధంగా ఉందన్నారు. రెండు కోట్ల 27 లక్షల 315 మంది కోటి రూపాయల ఆదాయం ఉన్నవారు, 265 మంది 100 కోట్లు ఆదాయం ఉన్నవారు, 25 మంది 500 కోట్ల రూపాయల ఆదాయం వచ్చే వారికి లాభం చేకూర్చే విధంగా ఈ బడ్జెట్ ఉందని అన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించి అధిక ధరల తగ్గింపుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తిస్థాయిలో అమలు చేయడానికి బిసి,ఎస్సీ, ఎస్టీ ప్రజల అభివృద్ధి తగ్గట్టుగా ఈ బడ్జెట్లో కేటాయింపులు లేవని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గించారని, నిరుపేదల వ్యవసాయ కార్మికుల ఉపాధిని దెబ్బతీసే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేశారని తెలిపారు. అత్యంత సంపన్న వర్గంపై నాలుగు శాతం సంపద పన్ను వేయాలని అన్నారు. దేశ స్థూల జాతీయా ఉత్పత్తిలో వైద్యానికి మూడు శాతం విద్యకు 6శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్, సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య అడ్డికే రాజేశ్వర్, వై రాజిరెడ్డి, పి.ముత్యాలు రఘురాం,అంజలి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తాం

- పట్టణంలో ఆనంద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం


వైద్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

గ్రామీణ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మా హాస్పిటల్ ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు నిర్విరామంగా అందిస్తామని ఆనంద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అప్పల ఆనంద్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పెర్కిట్ యందు గురువారం హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు అరుణ్ రెడ్డి, పూజా రెడ్డి మాట్లాడుతూ పీడియాట్రిక్, గైనకాలజిస్ట్, ట్రామ, క్రిటికల్ కేర్ లాంటి వైద్య ఆరోగ్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మేనేజింగ్ డైరెక్టర్ అప్పల ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానికులు

జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైన కానిస్టేబుల్ గోదావరి



నవతెలంగాణ-ఏర్గట్ల

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని బట్టాపూర్ గ్రామానికి చెందిన మూడ్ గోదావరి జిల్లా జట్టు తరపున ఆడి అత్తమ ప్రతిభ కనబర్చడంతో మహిళల కబడ్డీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికై శిక్షణకు అర్హత సాధించింది. అయితే గోదావరి గతంలో పలుమార్లు రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో ఆడిన అనుభవం ఉంది. ప్రస్తుతం గోదావరి నిజామాబాద్ పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

సమగ్ర కుల గణన రీసర్వే చేయించాలి

నవతెలంగాణ-మెండోర

రాష్ట్ర వ్యాప్తంగాసమగ్ర కుల గణన పూర్తి స్థాయిలో రీ సర్వే జరిపించాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి మూర్తి ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో జరిపిన సమగ్ర కుల గణన పూర్తిగా తప్పుల తడక అని, ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరచి పూర్తి స్థాయిలో సమగ్ర కుల గణన జరిపి ప్రభుత్వం చిత్త శుద్ధిని నిరూపించుకోవాలి అన్నారు. 60శాతం పైన ఉన్న బిసి లకు 46.25శాతం చూపించి 10.33శాతం ముస్లింలను చూపించి మొత్తం 56.58శాతంగా చూపించారన్నారు. వాస్తవంగా ముస్లిం మైనారిటీలు హిందూ మైనారిటీ లుగా ఎందుకు విభజించారని అన్నారు. మైనారిటీల రిజర్వేషన్లు వేరేగా చూయించాలని తెలిపారు. నిజంగా సామాజిక బిసి కుటుంబాలే 60శాతం పైగా ఉంటాయన్నారు. అందుకే పూర్తి స్థాయిలో రీ సర్వే చేయాలని లేని యెడల తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా నైతే అన్ని కుల సంఘాలు రోడ్డు పైకి వచ్చి కార్యక్రమాలు చేపట్టిన రీతిగా బిసి ఉద్యమం చేపడుతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తి స్థాయిలో రీ సర్వే చేయగలరు. అప్పుడే బిసి లకు కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత

- ట్రాఫిక్ ఏసిపి టి.నారాయణ
- రోడ్డు భద్రత, నియమాలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోడ్డు భద్రత నియమాలు వాహనదారులకు ఉత్తమమైన సాధనాలని ట్రాఫిక్ ఏసిపి టి.నారాయణ అన్నారు. గురువారం నగరంలోని నిషిత డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోటరీ క్లబ్‌ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, నియమాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసిపి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని సరైన అవగాహన పెంచుకొని తమను తాము రక్షిస్తూ ఇతరులను కూడా హాని కలుగజేయకుండా ఉండటమేనని అన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని, వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని పేర్కొన్నారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యులు ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ కొండ అమర్నాథ్ మాట్లాడుతూ.. ప్రతి నిమిషం ప్రపంచవ్యాప్తంగా చాలా యాక్సిడెంట్లు అవుతున్నాయని, అందులో భారత దేశంలో నిమిషానికి ముగ్గురు చనిపోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌ఆఫ్ నిజామాబాద్ కార్యక్రమ కార్యా నిర్వహణ అధికారి సుధీర్ గుప్త, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ సాయిలు, సభ్యులు గురుప్రీత్ సింగ్, తులసీదాస్పటల్, జ్ఞాన ప్రకాష్, నర్సింగ్ రావు, జుగల్ సోనీ, జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

ఐఐటి మెయిన్స్‌లో ప్రతిభ కనపరిచిన కాంతి పాఠశాల పూర్వ విద్యార్థి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ కాంతి హై స్కూల్ లో పదవ తరగతి 2022-23 లో పూర్తి చేసుకున్న చెలిమెల రాజేష్ అనే విద్యార్థి ఐఐటి మెయిన్స్ లో 99.75 పర్సెంటైల్ సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి గురువారం తెలిపారు. పట్టణానికి చెందిన చెలిమెల సువర్ణ చెలిమెల రాజేందర్ గార్ల కుమారుడు రాజేష్ చిన్ననాటి నుండే చదువుల్లో ప్రతిభా కనబరిచేవాడు. ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు కాంతి లోనే విద్యనభ్యసించాడు ఈ క్రమంలో పదవ తరగతిలో 9.5 సాధించగా, ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షల్లో 470 కి గాను 465 మార్కులు సాధించాడు. సైంటిస్ట్ అవ్వడమే తన లక్ష్యం అని చెప్పే రాజేష్ ఈ అద్భుతమైన ర్యాంక్, పర్సంటైల్ సాధించాడు. మున్ముందు విద్యార్థులు లక్ష్యాలను అందుకునే విధంగా కాంతి హై స్కూల్ తోడ్పడుతుందని, తెలిపారు.

వర్గీకరణ పేరుతో దళితులను విడదీయడం సరికాదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లో మాల మహానాడు జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు నీరడి లక్ష్మణ్ మాట్లాడుతూ.. జిల్లాలోని మాలలందరూ ఏకతాటిపై నిలిచి రాజ్యాంగ పరిరక్షణకై పోరాడవలసిన సమయం ఆసన్నమైందని, వర్గీకరణ పేరుతో దళితులను విడదీయడం సరైన పద్ధతి కాదని, ఇది అంబేద్కర్ ఆలోచన విధానాలకు వ్యతిరేకమని తెలియజేశారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సక్కీ విజయ్ మాట్లాడుతూ.. ఎస్సీలను వర్గీకరిస్తూ బిల్లును ప్రతిపాదించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, భవిష్యత్తులో రాజ్యాంగ రక్షణకై దళితులంతా కలిసి ఒక యుద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సక్కి చంద్రశేఖర్, కోర్వ లక్ష్మణ్, అధికార ప్రతినిధి టిఎస్ రమేష్, సలహాదారులు నల్ల బాలరాజు, మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాల మహానాడు ముఖ్య నాయకులుగా జిల్లాకు చెందిన వ్యక్తులను నియమించారు.

ఆలయాభివృద్ధికి భక్తుల విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ అభివృద్ధికి గురువారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన శ్రీనివాస్ సవిత దంపతులు ఆలయ అభివృద్ధికి రూ.50వేల రూపాయలు విరాళాన్ని ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణకు అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన ఉట్కూర్ సాయిలు (43) పనిలో భాగంగా బిచ్కుందకు రాగా అకస్మాతుగా ఫిట్స్ రావడంతో కిందపడి చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు సాయిలు భార్య గత పది సంవత్సరాల క్రితం చనిపోగా.. ఒక కూతురు ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఫిట్స్‌తో సాయిలు బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

తడి, పొడి, హానికర చెత్తను విభజించాలి

- మున్సిపల్ కమిషనర్ రాజు
- పలు దుకాణాలు, హెూటల్లో తనిఖీలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ప్రతి ఒక్కరూ చెత్తను తడి,పొడి, హానికర చెత్తగా విభజించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాలల్లో ప్లాస్టిక్, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్, హెూటల్స్‌లలో పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. తడి, పొడి, హానికర చెత్తగా విభజించి మునిసిపల్ వాహనాలకు అందించాలని అన్నారు. హెూటల్లు దుకాణాల వారు పరిశుభ్రతను పాటిస్తూ సింగిల్ ప్లాస్టిక్‌ను వాడకూడదని చెప్పారు. లేనిపక్షంలో చట్ట పరమైన చర్యలతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, జూనియర్ అసిస్టెంట్ రాజయ్య, వార్డ్ ఆఫీసర్ సింధుజ, ఆర్పీ లావణ్య, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండల కేంద్రానికి చెందిన మంతెన ముత్తెన్న (60) మతిస్మితం సరిగా లేక మద్యం అలవాటు ఉండి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గురువారం తెలిపారు. ఆలూర్ ఊరి చివరగల వెంకటేశ్వర గుట్ట కింద మొరంకోసం తవ్విన కుంటలో దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆయన భార్య గంగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈనెల 10 ఉదయం ఇంట్లోచ్చి వెళ్ళిపోయినట్టు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలం దేగాం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ వినయ్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను, గ్రామ ప్రజలను గురువారం కలిశారు. గ్రామ ప్రజలతో కలిసి టీ తాగారు. అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభ విజయవంతం చేయండి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సీపీఐ(ఎంఎల్) మస్‌లైన్ రాష్ట్ర నాయకులు ఆదర్శ కమ్యూనిస్టు విప్లవకారుడు కామ్రేడ్ కర్నాటి యాదగిరికు విప్లవ జోహార్లు అర్పిస్తూ 17న నిజామాబాద్ నగరంలో జరిగే సంతాప సభను విజయవంతం చేయాలని నాయకులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్, నాయకులు అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జరిగే వారి సంతాప సభకు మేధావులు, విద్యార్థులు, సానుభూతిపరులు అందరు హాజరై విప్లవ జోహార్లు అర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కమిటీ నాయకులు, గంగాధర్, నాయకులు మోహన్, ప్రసాద్, మమత, ఇమ్రాన్, విద్యార్థి, నాయకులు పాల్గొన్నారు.

అన్నదానానికి దాతలు ముందుకు రావాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

అన్నదాన కార్యక్రమాలకు దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ముబారక్ నగర్ వివి నగర్ కాలనీలో శ్రీ శివ సాయి బాబా మందిరం కార్యవర్గ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. శ్రీ శివ సాయి బాబా మందిరం మార్చ్ 24వ తేదీన 18వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నామని అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి తెలిపారు. వివి నగర్ కాలనీ వాసుల సహకారంతో, కమిటీ సభ్యుల సహకారంతో ప్రతి గురువారం నిరంతరం అన్నదాన కార్యక్రమాలను చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని కోరారు.

రూరల్ ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపతి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువా, పూల బొకేతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేస్తూ బిసిటియు చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కంచరి రవికుమార్, ఉపాధ్యక్షులు యు.విజయ్ కుమార్, సలహాదారులు డి.విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జంబి హనుమాన్ దేవాలయంలో జరుగుతున్న

చోరీలపై దేవాదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ దేవాలయంలో జరుగుతున్న దొంగతనాలు, అవినీతి, అవకతవకతలపై గురువారం ఫిర్యాదు చేశారు. హైదరాబాదులోని దేవాదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ అడిషల్ కమిషనర్, విజిలెన్స్ డిపార్ట్మెంట్‌కు ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా పట్టణంలోని జంబి హనుమాన్ దేవాలయంలో జరుగుతున్న దొంగతనాలు అవినీతి అవకతవకలు పై ఫిర్యాదు చేసినట్టుగా శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి పన్నంవార్ తెలిపారు. వారితో దేవాలయం అర్చకులు నర్సింగ్ రావు ఫిర్యాదు చేసినట్టుగా తెలిపారు. ముఖ్యంగా అక్కడ పనిచేస్తున్న అటెండర్ గోపి అవినీతి అక్రమాలకు పాల్పడడం అంతేకాకుండా దేవాలయనికి వచ్చే చందాల్లో చేతివాటం చూపించడం అనే వాటిపై ఫిర్యాదు చేశామన్నారు. ఈవోగా పనిచేస్తున్న శ్రీరాం రవీంద్ర గుప్త పంతుళ్ళపట్ల దురుసుగా ప్రవర్తిస్తూ వేలకు వేలు జీతాలు తీసుకుంటున్న ఎండోమెంట్ ఉద్యోగులు అయిన హరితా రాణి, అటెండర్ గోపీపై చర్యలు తీసుకోకుండా వారిని కాపాడటంలో మతలబు ఏమిటో ఈఓ చెప్పాలన్నారు. మడిగెల కిరాయిదారులకు లంచం అడుగుతున్న ఈఓ ఇవ్వని వారి మడిగెలు సీజ్ చేసి తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. 17 లక్షల ఆదాయం వస్తున్న దేవాలయానికి కనీస వసతులు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకుండా శాశ్వతమైన అర్చకులను ఏర్పాటు చేయకుండా దొంగతనాలు జరిగిన కూడా పోలీసులకు ఫిర్యాదు చేయకుండా విధులు నిర్వహించని ఉద్యోగులను కాపాడుతున్న ఈవోపై బహిరంగ విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గత డిసెంబర్ 20న దేవుడి ఆభరణాల చోరీ.. గోప్యతలో అంతర్యం ఏమిటి.. అంటూ నవతలంగాణలో కథనం రావడం సంబంధిత వ్యక్తులను కలవరానికి గురిచేసింది.

జిజి ఫౌండేషన్ కార్యాలయంలో సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జి జి ఫౌండేషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ యువ నాయకులు మెట్టు సాయికుమార్ గురువారం ఆత్మీయ స్వాగతం పలికి శాలువా మెమొంటోలతో ఘనంగా సన్మానించినట్టు జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు డీజే దయానంద్, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు నారాయణ్ వర్మ డీజే. కాశినాత్,డీజే. సునీల్,కాంగ్రెస్ బీసీ అధ్యక్షులు బోచకర్ వెను భింగి పెంటయ్య పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన నాంపల్లి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు నాంపల్లి గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన



నవతెలంగాణ-వర్ని

ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంజెపిబీసీ వెల్ఫేర్ స్కూల్‌లో అయోడిన్ లోపం రుగ్మతలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు గురించి అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ ప్రోగ్రాంలో రీజినల్ కోఆర్డినేటర్ ఆఫీసర్ సత్యనాథ్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.పద్మజ, ప్రభుత్వం మెడికల్ కాలేజీ అసి.ప్రొఫెసర్ డా.దీప్తి నాయక్, జెడ్పిహెచ్ఎస్ హెచ్ఎం శాంత కుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మణి పాల్గొన్నారు. అయోడిన్ లోపంతో కౌమారదశలో ఉన్న పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతుందని, బ్యాలెన్స్‌డ్ డైట్ తినాలని ఆర్‌సిఓ సుచించారు. ఇలాంటి సిఎస్ఆర్ కార్యక్రమాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లాంటి సపోర్ట్ అందిస్తున్నారని ప్రిన్సిపాల్ పద్మజ అన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కె.సమత, సిబ్బంది వై.గంగ, సిహెచ్.రాధిక, ఎస్.రాజు, కె.నారాయణ, పి.పోచయ్య, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ గ్రేడ్‌లతో ఉత్తీర్ణత సాధించాలి



నవతెలంగాణ కమ్మర్ పల్లి

మండల కేంద్రంలోని మినిమి ఉన్నత పాఠశాలలో గురువారం తల్లుల దీవెన దినోత్సవాన్ని (మదర్స్ బ్లెస్సింగ్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేసుకొని, దీవెనలు తీసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ గ్రేడ్ లతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని తమ పిల్లలను తల్లులు దీవించారు. అనంతరం ఇద్దరు దంపతులకు ఉత్తమ తల్లిదండ్రులుగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. అంతకుముందు నిర్వహించిన పేరెంట్ ఓరియెంటేషన్ తల్లిదండ్రుల సమావేశంలో మోటివేటర్ శ్రీనివాస్ విద్యార్థులకు సంబంధించి పలు అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలన్నారు. తమ పిల్లలు ఎప్పుడు సెల్ ఫోన్లకు, టీవీకి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక తీసుకోవాలన్నారు. గంటల తరబడి విద్యార్థులు ఫోన్లలో నిమగ్నమై ఉంటే వారు ఫోన్లో ఏం చేస్తున్నా అనే విషయాన్ని తల్లిదండ్రులు తప్పనిసరిగా గమనించి, వాకబు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలే రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి క్రీడాకారుడు నైపుణ్యతను చాటుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్
- మాలవత్ తండాలో క్రీడలు ప్రారంభం



మాట్లాడుతున్న బుర్రనారాగౌడ్

నవతెలంగాణ-లింగంపేట్

ప్రతి క్రీడాకారుడు తమ నైపుణ్యతను చాటుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మాలవత్ తండాలో కబడ్డీ క్రీడలను ఆయన ప్రారంభించారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని క్రీడలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ముందుగా క్రీడాజ్యోతిని వెలిగించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన తండాలో డివిజన్ స్థాయి క్రీడలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూల్ సింగ్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, మండల యూత్ అధ్యక్షులు రాజు, రామకృష్ణ గౌడ్, రాజేశ్వర్ గౌడ్, శివలాల్, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరి ధర్నాను విజంతం చేయాలి

- టిఎస్‌సిపిఎస్ఇయు జనరల్ సెక్రటరీ దామోదర్
- చలో హైదరాబాద్ గోడపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-లింగంపేట్

హైదరాబాద్‌లో మార్చి 2న నిర్వహించనున్న యుద్ధభేరి ధర్నాను విజయవంతం చేయాలని టి.ఎస్.సి.పి.ఎస్.ఇ.యు జనరల్ సెక్రటరీ దామోదర్ పిలుపునిచ్చారు. మండలంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యాయులతో కలిసి యుద్ధభేరి పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న యుపిఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే విరమించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ సూరయ్య, టిఎస్‌సిపిఎస్ఇయు సభ్యులు పద్మ, రజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు చేయడం అభినందనీయం

- లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నాగేష్ పంపాటి

నవతెలంగాణ- ఆర్మూర్

పట్టణంలోని లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత కంటి పరీక్షలు చేయడం అభినందనీయమని లయన్స్ డిస్టిక్ గవర్నర్ నగేష్ పంపాటి అన్నారు. పట్టణంలోని గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాతపురంను సందర్శించారు. ఇక్కడ ఆపరేషన్ చేయడం హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్, డిస్టిక్ సెక్రెటరీ శ్రీధర్,నరసింహారాజు, చార్టర్ సభ్యులు డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి, గంగారెడ్డి ,కార్యదర్శి మ్యాక శ్రీకాంత్, కోశాధికారి నారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని మానసిక వికలాంగులకు కొలి ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ దంపతులు దుస్తులను గురువారం అందజేశారు. సింగిల్ విండో చైర్మన్ పెద్ద కుమారుడు జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పండ్లు, దుస్తులు అందజేశారు.